క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, సీతారాంపురం కాలనీలలో 11కేవీ, ఎఫ్‌సీఐ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ, హనుమాన్‌పేట ఫీడర్ కింద 33కేవీ నూతన లింక్ లైన్ పనుల నిమిత్తం పట్టణంలోని గాయత్రినగర్, హనుమాన్‌పేట, నాగార్జుననగర్, రెడ్డి కాలనీ, ముఎత్తిరెడ్డికుంట, అశోక్‌నగర్, ఇండస్ట్రియల్ ఫీడర్ కింద ఉన్న ఎఫ్‌సిఐ, ప్రకాశ్‌నగర్, బాపూజీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ కోడిరెక్క రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ ఇందిర

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పైలాన్‌కాలనీకి చెందిన కౌన్సిలర్ నిమ్మల ఇందిర తన భర్తతో కలిసి శనివారం సీఎం సమక్షంలో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

శాంతినగర్‌లో ఉచిత వైద్యశిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మిర్యాలగూడ అర్బన్ : శ్రీ బాలాజీ న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ ఉదయ్ భాస్కర్ ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ అభిషేక్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ ఆస్పత్రి అధినేత్రి పోషం సునీతశ్రీనివాస్, మేనేజింగ్ పాట్నర్ చిలుకూరి గోపినాథ్‌తో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ప్రచార రథం ప్రారంభం


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలో బీజేపీ ప్రచార రథాన్ని శనివారం మండల పార్టీ అధ్యక్షుడు శివర్ల రమేశ్‌యాదవ్ ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, బీజేపీ 400 సీట్లతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యకులు కుకుడపు రామకృష్ణ, వెన్నం శేఖర్, బొడ్డు మహేశ్, జంగయ్య, శ్రీనివాస్, కిరణ్, తిరుమల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు రెడ్డి కాలనీకి చెందిన తూటిపల్లి రాములు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, హాలియా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ పిల్లి చంద్రకళ ఆంజనేయులు శనివారం పట్టణంలోని బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు రాములు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా అనిత

చింతపల్లి : బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా చింతపల్లి మండలంలోని కుర్రంపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఎదిరిశెట్టి అనిత నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నల్లగొండ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఎండుతున్న పల్లెప్రకృతి వనాలు

- పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న వైనం
- రెండేళ్ల వరకు ఉపాధి హామీలో నిర్వహణ
- ప్రస్తుతం గ్రామపంచాయతీలదే బాధ్యత
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు


పెద్దవూర పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు


పెద్దవూరలో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న పల్లె ప్రకృతి వనం

పెద్దవూర: పల్లె ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించాలనే ఉద్దేశ్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. వీటి ఏర్పాటు కోసం ప్రత్యేకంగా గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి నిధులు కేటాయించారు. వీటిలో నీడనిచ్చే మొక్కలు, పూలు, పండ్ల మొక్కలతో పాటు ఆహ్లాదాన్ని పంచే మొక్కలను పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకోసం గ్రామాల్లో అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని ఉన్నతాధికారులు సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ప్రభుత్వం ఉన్నతాధికారుల ఒత్తిడితో పలు ప్రయత్నాలు చేసి స్థలాలను గుర్తించారు. కొన్ని గ్రామ పంచాయతీలో మొక్కలు పెరిగేందుకు అనుకూలమైన స్థలం లేకున్నా పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఏదో తూతూ మంత్రంగా మొక్కలు నాటి పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు కనిపించకుండా పోయాయి. అక్కడ పిచ్చి మొక్కలు పెద్ద పెద్ద బండరాళ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి.

నిర్వహణ గాలికి..

2018–19 సంవత్సరంలో ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతలను రెండేళ్ల పాటు ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులకు అప్పగించారు. వారి రెండేళ్ల కాల పరిమితి ముగిసిన అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు అప్పగించారు. వారి పదవీ కాలం ముగిసేంతవరకు కొంతమంది సర్పంచ్‌లు ప్రత్యేక చొరవతో పల్లె ప్రకృతి వనాలను కాపాడారు. చాలా గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ ప్రస్తుతం గాలికి వదిలేశారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

నీళ్లు లేక ఎండుతున్న మొక్కలు

మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. వీనితో పాటు బెట్టిలతండా వద్ద పొట్టిచెల్మ సమీపంలో బృహత్ పల్లె ప్రకృతి వనం సైతం ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పల్లె ప్రకృతి వనానికి సుమారు రూ. 30వేల నుంచి రూ.35వేల వరకు ఖర్చు చేయగా, విస్తీర్ణం ఎక్కువ ఉన్న ప్రకృతి వనానికి రూ.50వేల వరకు ఖర్చు చేశారు. మండలంలో అన్నింటికి కలిపి సుమారు రూ.12లక్షల వరకు ఖర్చు చేశారు. గత ఎనిమిది నెలలుగా వర్షాలు పడకపోవడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలలో మొక్కలు ఎండిపోతున్నాయి. పల్లె ప్రకృతి వనాలకు ఏర్పాటు చేసిన నీటి వనరులు సైతం తీవ్ర వర్షాభావంతో ఎండిపోయాయి. దీంతో మొక్కలకు నీరు లేక ఎండిపోతున్నాయి. చాలా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలలో డ్రిప్ సిస్టం ఏర్పాటు చేశారు. నీరు లేక ఇవేమీ పనిచేయడం లేదు. ప్రస్తుతం వాటి నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోయి పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీలకు నిధుల లేమి ఉండటంతో పంచాయతీ కార్యదర్శులు సైతం మొక్కలను కాపాడలేక పోతున్నారు.

> **గ్రామ పంచాయతీలే చూసుకోవాలి**
>
> పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు అనంతరం నిర్వహణ బాధ్యతలను రెండేళ్ల పాటు తమ శాఖ ఉద్యోగులకు అప్పగించారు. కాల పరిమితి అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సంబంధిత గ్రామ పంచాయతీలకు అప్పగించారు. చాలా చోట్ల పల్లె ప్రకృతి వనాల్లో ప్రస్తుతం పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వనాలలో నాటిన మొక్కలు ఎండిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చింది.
>
> –వర్కాల మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ, పెద్దవూర

మోదీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి


బ్యాడ్మింటన్ ఆడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

మిర్యాలగూడ టౌన్ : ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్ఎస్‌పీ క్యాంపు, సుందరయ్య పార్క్‌లలో మార్నింగ్ వాకర్స్‌లో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అదే విధంగా ఎన్ఎస్‌పీ క్యాంపులోని యోగా కేంద్రంతో బ్యాడ్మింటన్ హాల్, రైతు బజారు, సంతోష్ టీ స్టాల్ వద్ద ప్రచారం నిర్వహించారు. అనంతరం కొంత సేపు బ్యాడ్మింటన్, క్రికెట్ఆడి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం 600 అబద్దాలు ఆడుతుందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని అన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, చిలుకూరి శ్యాం, జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి, నియోజకవర్గ ప్రభారి గోపిరెడ్డి లచ్చిరెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత, వనం మధన్‌మోహన్, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, రమేష్, చిల్లంచర్ల అభి, పెదమాం భరత్, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, సీతారాంరెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అజయ్, ఉబ్బపల్లి నంద, బోట్టు సోములు, బంటు యాదగిరి, నాగిరెడ్డి, శ్రీకాంత్, మంద శివ, కరుణాకర్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న యాదగిరిగౌడ్

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు డాక్టర్ గాలి సైదిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్ ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసాలతో పాటు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కత్తి మహాలక్ష్మీముత్యాల్‌రెడ్డి, క్రీడా నిర్వాహకుడు గాలి సైదిరెడ్డి, నాయకులు కూన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, పొట్టిపాక కాంతయ్య, నక్కల నాగిరెడ్డి, చెన్నయ్య, అన్వేష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్, ప్రశాంత్, కొండల్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్, నాయకులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని చింతచెట్టుతండాలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి, దేవులసాథ్ బాపూజీ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో శనివారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోమానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దూదిపాల వేణుధర్‌రెడ్డి, జాలె నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్‌నాయక్, గంధం సురేష్, భీమ్‌సింగ్, రమావత్ జగన్‌నాయక్, లాలునాయక్, ముడావత్ మంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : మండలంలోని కన్నెకల్లు గ్రామంలో నిర్మించిన కట్ట మైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయంలో పూజారులు మూల విరాట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొనేందుకు భక్తులు, గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. దాతలు కొత్తపల్లి సైదాచారి, కొండల్, వెంకటాచారి సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్


బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ అని, బీసీల అభ్యున్నతికి మండల చేసిన సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో బీపీ మండల్ 42వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల్ కమిషన్‌లో 40 సిఫారస్సులను పూర్తిగా అమలులోకి తీసుకవచ్చి బీసీల సమగ్ర అభివృద్ధికి పాటు పడినప్పుడే ఆ మహనీయుడికి నిజమైన నివాళి అని అన్నారు. మండల్ కమిషన్ రిపోర్ట్‌లో కేవలం రెండు సిఫారసులు మాత్రమే ప్రభుత్వం అమలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 30ఏళ్లు అయినప్పటికీ నేటి వరకు కూడా మిగిలిన సిఫారసులు అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, జానపాటి రవి, పేదమాం వీరస్వామి, మంద శివ, ఈశ్వర్, శేఖర్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కను చంపిన వారిపై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు

మిర్యాలగూడ టౌన్ : తమ పెంపుడు కుక్కను చంపిన వారిపై చర్యలను తీసుకోవాలని కోరుతూ బాధితుడు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. మిర్యాలగూడ మండలం లావూడితండాకు చెందిన లావూడి పత్తి అనే వ్యక్తి కుక్కను సాధుకుంటున్నాడు. ఈనెల 12 రాత్రి తన కుక్కను గుర్తు తెలియని వ్యక్తులు చంపి తన ఇంటి పక్కనే పడవేశారు. తన పెంపుడు కుక్కతో పాటు గ్రామంలో సుమారు 60 నుంచి 80 కుక్కలను చంపారు. కుక్కలను చంపిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి


మారేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హాలియా : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, హైకోర్టు ప్రముఖ న్యాయవాది ఎంఏ హరుణ్ అంజద్ అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మారేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. మిల్లర్లు తాలు పేరిట కటింగ్ విధిస్తున్నారని కొంత మంది రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైస్ మిల్లర్లు తాలు పేరిట కటింగ్ విధించి రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. దళారులకు ధాన్యం అమ్ముకొని నష్టపోవద్దని రైతులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కె సైయ్యద్, ఏడుకొండలు, లక్ష్మయ్య, సరితశ్రీను, కాశీం, వెంకటేశం, క్రాంతి, శ్రీకాంత్, బీమ్లా, వెంకటయ్య, శంకర్, లింగయ్య,, గణపతి, సతీష్‌చ మల్లేష్, సాయి, వేణు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి మృతి



నిడమనూరు : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి ప్రధాన అనుచరుడు మేరెడ్డి సురేందర్‌రెడ్డి (80) శనివారం ఉదయం హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. నిడమనూరు మండలం మారుపాకకు చెందిన సురేందర్‌రెడ్డి భార్య గతేడాది మృతిచెందింది. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన రెండు పర్యాయాలుగా మారుపాక గ్రామ సర్పంచ్‌గా, ఒకసారి ఎంపీటీసీగా, ఒకసారి ఊట్కూర్ సింగిల్ విండో చైర్మన్‌గా వ్యవహరించారు. విదేశాల్లో ఉన్న ఇద్దరు కుమారులు రాగానే సోమవారం స్వగ్రామం నిడమనూరు మండలం మారుపాకలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన పెద్ద కుమారుడు మాజీ ఎంపీటీసీ మేరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సురేందర్ రెడ్డి మృతికి మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జయ్‌వీర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, యడవెల్లి రంగశాయిరెడ్డి, మేరెడ్డి వెంకట్రాహుల్, జెడ్పీటీసీ నందింకొండ రమేశ్వరిమట్టారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంకతి సత్యం, కొండా శ్రీనివాసరెడ్డి, నర్సింగ్ విజయ్, ఎంపీటీసీ సురుగురు చంద్రశేఖర్, చిత్రం ప్రసాద్ తదితరులు తీవ్ర సంతాపం తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న మేధా ఫౌండేషన్ సభ్యులు

మాడుగులపల్లి : మహిళలు కుట్టు మిషన్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మేధా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పిన్నం వేణుగోపాలాచారి, కనుకుంట్ల నాగరాజు అన్నారు. మండలంలోని ధర్మాపురం గ్రామంలో ఫౌండేషన్ తరపున కుట్టు మిషన్, బ్యూటీషియన్ శిక్షణా తరగతులను శనివారం వారు ప్రారంభించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఫౌండేషన్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు యువత సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కొత్తపల్లి సైదులు, సుంకోజు శ్రీకాంత్, శిక్షణా ఇన్‌చార్జి ఎర్ర రాజు వసంత, నాగేంద్రబాబు, సందీప్, మస్తాన్, శివకుమార్, అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్ : పెన్షనర్ల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జరిగిన నల్లగొండ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగదు రహిత వైద్యం, పీఆర్సీ తదితర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో తాలుకా అధ్యక్షుడు గజవెల్లి సత్యం, కార్యదర్శి యాద వాసుదేవ్, జల్ల పులయ్య, జి.సుధాకర్, ఎం.శేషారెడ్డి, ఎం.రఘునాథన్, కేశవాచారి, మహేశ్వర్, రమేష్, రంగయ్య, ప్రసాద్, రవి ప్రసాద్, చక్రపాణి, ఆజం అలీ, బాలరాజు, భిక్షం, కృష్ణయ్య, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు


గుర్రంపోడులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర : దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డిలు అన్నారు. శనివారం గుర్రంపోడు మండల కేంద్రంలోని ప్రారంభమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన సప్తమ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పండుగలు, జాతరలు గ్రామాలలో ప్రజల మధ్య సత్సంబంధాలను ఏర్పర్చుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


ఆశ్రమ పాఠశాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దవూర : మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశానుసారం శనివారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, ఎవరికైనా కంటి చూపు సమస్యలు ఉన్నాయా అని పరీక్షించారు. కంటి సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి కంటి అద్దాలకు రిఫర్ చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్లు, రాంబాబు, సునీత, పాఠశాల ఏఎన్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు రాంరెడ్డి, కృషపాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక


మాడుగులపల్లి : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి జానారెడ్డి

మాడుగులపల్లి : మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీని వీడి శనివారం మాజీ మంత్రి జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జానారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి విజయమే లక్ష్యంగా పనిచేయాలని వారికి ఆయన సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మాపురం మాజీ సర్పంచ్ చింతరెడ్డి సైదిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కుందూరు లింగారెడ్డి, బక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జానారెడ్డికి సన్మానం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ వైస్‌చైర్‌పర్సన్ ఆదాసు నాగరాణి మాజీమంత్రి కుందూరు జానారెడ్డిని శనివారం శాలువా కప్పి సన్మానించారు. ఇటీవల ఆమె మున్సిపాలిటీ వైస్‌చైర్‌పర్సన్‌గా ఎంపిక అయ్యారు. తమ ఎంపికకు సహకరించిన జానారెడ్డికి కృతజ్ఞతలు తెలిపి అనంతరం ఆశీర్వాదం పొందారు.

డంపింగ్ యార్డులా జాతీయ రహదారి


దేవరకొండ–కొండమల్లేపల్లి ప్రధాన రహదారి పక్కన చెత్త ఇలా..

కొండమల్లేపల్లి : చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకండి...తడిచెత్త–పొడి చెత్త వేరు చేసి అందించాలంటూ గ్రామపంచాయితీ అధికారులు ప్రతి రోజూ కాలనీల్లో ట్రాక్టర్ల ద్వారా ఎంత ప్రచారం చేసినా తీరు మారడం లేదు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేస్తుండడంతో ఇబ్బందులు ఎదురవడమే కాకుండా దుర్వాసన సైతం వెదజల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. మరీ ముఖ్యంగా కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన పలువురు వ్యాపారులు చెత్తను దేవరకొండ–కొండమల్లేపల్లి ప్రధాన రహదారిపై పడవేస్తుండటంతో 167వ జాతీయ రహదారి చెత్తకు నిలయంగా మారుతుందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులతో పాటు ప్రజలు సైతం సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరుదాం.

ఆర్థిక సాయం అందజేత

త్రిపురారం : మండలంలోని కంపాసాగర్ గ్రామానికి చెందిన సింగారపు సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో శనివారం ఆదే గ్రామానికి చెందిన కొండా భాస్కర్ మృతుడు సోమయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు, 50 కేజీల బియ్యం ఆర్థికసాయంగా అందజేశారు. అనంతరం సోమయ్య చిత్రపాటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వల్లపు సైదులు, నర్సయ్య, వెంకన్న, యాదగిరి, నాగరాజు, జానయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శేషగిరిశర్మ

మిర్యాలగూడ : మండలంలోని గోగువారిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీఓ శేషగిరిశర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని జరిగే ప్రదేశంలో వేజ్ సీకర్లకు నీడ కోసం షెడ్, తాగునీరు, మెడికల్ కిట్ ఏర్పాటు చేయడమైందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం త్వరగా వచ్చి పనులను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ప్రతి రోజు రూ.300 వేతనం అందేలా కొలతల ప్రకారం పనిచేయాలన్నారు. అదేవిధంగా గ్రామంలో నీటి సమస్య లేకుండా చూడాలని ఆయన పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పద్మ, టీఏ రేణుక, ఎఫ్ఏ శ్రీలత పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఉండొద్దు


అడవిదేవులపల్లి : వాటర్ ట్యాంకులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి : ఈ వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఎంపీడీఓ కరుణాకర్‌రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను శనివారం శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ట్యాంకుల్లో క్లోరిన్ తదితర వాటిని ఆయన పరిశీలించడంతో పాటు గ్రామస్తులతో కొంత సేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు క్లోరేషన్ తప్పకుండా వేయాలన్నారు. అదే విధంగా ఏమైన బోర్లు, పైపులైన్లు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి తాగునీటి విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.